
రోజే తాళికట్టిన భర్తను, స్త్రీ ఎందుకు నమస్కరిస్తుంది?
జ. ప్రాణభయంవల్ల
జి. రమేష్ ప్రత్తిపాడు
ప్ర. తెల్ల టోపీకి ఎర్ర టోపీకి తేడా ఏమిటి?
జ లాఠీ లాఠీ
ప్ర. గోడలకి చెవులుంటాయట మరి మందాలకి?
జ కళ్ళుంటాయ్
సూర్యప్రకాశరావు రామరాజులంక
ప్ర. ఆడవారు "తాము 'అబల'లంకాదు 'సబల'లం" అని నిరూపించుకోవాలంటే?
జ భర్తను కట్నకానుకలు తెమ్మని వేధించి కిరసనాయిలు పోసి తగలెయ్యాలి
కె. నన్ని అనకాపల్లి
ప్ర. కంప్యూటర్! నీకే దేవుడు ప్రత్యక్షమయితే నువ్ కోరే వరమేమిటి?
జ మిగతా కంప్యూటర్లన్నీ నాశనం అయిపోవాలని

ఎ. వి. భాస్కర్ అనకాపల్లి
ప్ర. ఒకప్పుడు దేశ స్వాతంత్ర్యంకోసం పోరాడేవారికి ప్రజలు చేయూతనిచ్చినారు కాని ఇప్పుడు దేశ శ్రేయస్సు కొరకు పాటుపడేవారిని ప్రజలే కాల్చి చంపుతున్నారు? ఎందుచేత?
జ అందరూ ఒకేసారి దేశశ్రేయస్సు కోరటంవల్ల
పి. రమేష్‌బాబు హైదరాబాద్
ప్ర. ఒలింపిక్స్‌లో ఇండియాకు పతకాలు రాకపోవడానికి కారణం?
జ అన్నీ మిగతా దేశాలు తీసేసుకోవటంవల్ల
సి. వి. నరసింహదాసు విజయనగరం
ప్ర. 'నీకు తెలిసి విషయమేమిటో చెప్పుకో చూద్దాం!'
జ ఫిక్స్ చెయ్యకుండా దాచిన విషయాలు
పి. రమేష్‌బాబు తెనాలి
ప్ర. ఇల్లు పీకి పందిర' అంటే?
జ చిన్న ఇల్లు ఎస్టాబ్లిష్ చేయటం






# అందరూ వైద్యులే

హాస్పిటల్‌లో పని ముగించి ఇంటికి వెళ్ళామనుకుంటున్న సమయంలో నా ఫ్రెండ్ దగ్గరనుండి ఫోనొచ్చింది.

వాడి వాయిస్ నీరసంగా ఉంది.

అదే అడిగాను నేను.

"పది రోజులనుండీ జ్వరం" అన్నాడు వాడు.

"మరి ఇన్ని రోజులనుండీ ఏం చేస్తున్నావ్? నాకు ఫోన్ చేస్తే వచ్చి చూసేవాణ్ణి కదా?" కాస్తంత కోపంగా అడిగాను నేను.

"మామూలు జ్వరమేకదా, దానంతట అదే పోతుందేమో అనుకొన్నాను. అదీ కాక హడావుడి రాజుగారు ఏవో మందు లిస్తున్నారు తగ్గుతుందేమో అనుకున్నా" అన్నాడు రాజు.

"డాక్టర్ కాదనుకో కాని కాస్తంత వైద్యం తెలుసంటాడు. ఇలా తెలిసిన వాళ్ళకి తనకు తోచిన మందేదో ప్రిస్క్రైబ్ చేస్తూ ఉంటాడు. చిట్కా వైద్యం నుండి అలోపతి వరకు అన్ని రకాల మందులూ వాడుతూంటాడాయన మా నాన్నగారికి ఆయన వైద్యంమీద నమ్మకం ఎక్కువ, మా నాన్నగారి సంగతి తెలుసుకదా!" అన్నాడు రాజు.

అదన్నమాట సంగతి. తండ్రికి జడిసి మా వాడు పదిరోజులుగా జ్వరం తగ్గకపోయినా నాకు ఫోన్ చేయలేదు. నేను ట్రీట్‌మెంట్ మొదలెడితే వాళ్ళ నాన్నగారికి ఎక్కడ కోపం వస్తుందోనని వాడి భయం. వాళ్ళ నాన్నగారికి హడావుడిరాజు మందుమీద నమ్మకముందంటే, ఇంకెవరు

## డాక్టర్ శ్రీధర్

"హడావుడి రాజా? ఆయనెవరు?" అడిగాను నేను ఆ పేరుకి ఆశ్చర్యపడుతూ.

"మా ఇంటిదగ్గరే మా దూరపు బంధువొకాయన ఉన్నాడులే మాంఛి హడావుడి మనిషి అందరూ ఆయన్ని హడావుడి రాజా అనే పిలుస్తారు."

"డాక్టరా?" అడిగాను నేను.


వైద్యంచేసినా ఆయన ఒప్పుకోకపోవచ్చు.

"సరే సాయంత్రం నే వస్తాలే!" అని ఫోన్ పెట్టేసాను.

నేను, రాజు చిన్ననాటినుండి స్నేహితులం. ఇంటర్మీడియట్ వరకు కలిసే చదువుకొన్నాం. ఇంటర్మీడియట్ తరువాత నాకు మెడిసిన్‌లో సీటు రావటం వాడికి రాకపోవటం మూలాన ఇద్దరం

విడిపోవాల్సి వచ్చింది. నేను మెడిసిన్ పూర్తిచేసేసరికి వాడు బి. యస్. సి. కంప్లీట్ చేసి బ్యాంక్‌లో క్లర్క్‌గా జాయినయ్యాడు. రాజు వాళ్ళ నాన్నగారు రామలింగరాజుగారిదో విచిత్రమైన మనస్తత్వము. తాను పట్టిన కుందేటికి ఎట్టి పరిస్థితిలోనూ మూడే కాళ్ళుంటాయనే రకం ఆయన.

సాయంత్రం నేను వెళ్ళేసరికి రాజు వాడి బెడ్‌రూమ్‌లో పడుకొని ఉన్నాడు నేను గుమ్మందగ్గర ఉండగానే వాళ్ళ నాన్నగారు పలకరించారు.



"రావోయ్ రా! నీ ఫ్రెండ్ పడకేసాడు చూశావా!"

నేను ఆయనకి నమస్కారంచేసి రాజు బెడ్‌మీద ఓ మూలకి కూర్చున్నాను

రాజు బాగా నీరసంగా కనిపిస్తున్నాడు. దవడలు లోపలికి పీక్కుపోయాయి. గడ్డం బాగా మాసిపోయి ఉంది.

"టెంపరేచర్ ఎంతుందో చూశావా?"



అడిగాను రాజుని.

"ఇందాకే నోట్‌చేసా వందడిగ్రీలుంది" అన్నాడు వాడు.

బెడ్ ప్రక్కనే ఉన్న టేబుల్‌మీద వాడు వాడుతున్న మందులు కాబోలు, ఉన్నాయి. వాటిని చేతిలోకి తీసుకొని చూశాను నేను.

"అవన్నీ హడావుడి రాజుగారు ఇచ్చిన మెడిసిన్స్" అన్నాడు రాజు.

"పది రోజులనుండీ ఇవే వాడుతున్నావా?" అనడిగాను.

"అబ్బేలేదు ఇంతకుముందు ఇంకేవో రెండుమూడు రకాలు వాడినా తగ్గకపోతే మందులు మార్చి ఇవి ప్రెస్క్రైబ్ చేసాడు" అన్నాడు రాజు.

"ఈ మధ్య వస్తున్న జ్వరాలు, అవేమిటి, వైరల్ ఫీవర్స్‌కాబోలు, త్వరగా తగ్గేట్లేదని కదా, ఇంకా రెండురోజులు పట్టొచ్చునన్నారు హడావుడి రాజుగారు" అన్నారు రామలింగరాజుగారు.

"ఏంటి బయాటిక్స్, ఏంటి పైరటిక్స్ ఇస్తున్నట్టున్నాడు"

అప్పటిదాకా ఆ రూమ్‌లో ఉన్న నాలుగవ మనిషిని చూడలేదు నేను. రామలింగరాజుగారి ప్రక్కనే కూర్చొని ఉన్నాడాకాయన. బహుశా 35 ఏళ్ళుంటాయేమో అతనికి.

"ఈయన సుబ్బారావుగారని ఇక్కడే జంతర్ మంతర్ ఫార్మస్యూటికల్స్‌లో కెమిస్టుగా పని చేస్తున్నాడు" అన్నారు రామలింగరాజుగారు.

"జంతర్ మంతర్ ఫార్మస్యూటికల్సా?" ఆశ్చర్యంగా అడిగాను నేను. ఆ పేరెక్కడా విన్లేదన్న అనుమానం ధ్వనించేలా.

"అబ్బే మేం మందులకు కావలిసిన రామెటీరియల్స్ మాత్రమే సప్లయిచేస్తాం అందుకే మీరు వినుండరు. నేనూ ఇదే ఫీల్డులో పని చేస్తున్నాను కాబట్టి నాకూ కాస్తో కూస్తో ఈ మందుల విషయం తెలుసు. మా ఇంట్లో వచ్చే చిన్న చిన్న జబ్బులకి నేనే ట్రీట్‌మెంట్ యిస్తూ ఉంటాను. మన రాజుకికూడా ఆంపెనిసిలిన్ తీసుకోమని హడావుడిరాజుకంటే ముందే నేను సజెస్ట్ చేసాను" అన్నాడాయన.

"ఆంపెనిసిలినా?" అయోమయంగా అడిగాను నేను.

"అదే ఆంపిసిలిన్, ఆంపిసిలిన్" అన్నాడు రాజు.


"ఆ- అదే నేనూ అంటున్నది ఈ పేంక్రియాస్ జబ్బులున్నాయి చూసారూ, ఇవి పవర్‌ఫుల్ ఆంటిబయాటిక్స్ ఇస్తేగాని తగ్గవు" అన్నాడాయన.

"పేంక్రియాస్ జబ్బేమిటీ? ఎవరికి?" అడిగాను నేను. నాకంతా అయోమయంగా ఉంది.

"ఆయన ప్రతీదీ పేంక్రియాస్ మూలానే వచ్చిందంటాడులే. నువ్వూరుకో. లేకపోతే మరోగంట పేంక్రియాస్ మీద లెక్చరిస్తాడు. ఇప్పటికే రెండు గంటలనుండీ సుత్తిభరించలేక ఛస్తున్నా" అన్నాడు రాజు నాకు మాత్రమే వినబడేలా.

కానీ సుబ్బారావుగారు మాత్రం దొరికిందే సందు అన్నట్టుగా అందుకున్నాడు.

"రాజుకి ఏ జబ్బూ లేదండీ వాడి పేంక్రియాస్ చాలా వీక్ అందుకే ఇలా మామూలు జ్వరాలుకూడా ఇన్నిరోజులు తగ్గకుండా పీల్చేస్తాయి. అదీ మామూ



లుగా అయితే రెండుమూడు రోజుల్లో తగ్గవలసిన మాటకాని పేంక్రియాస్ దెబ్బ తినడంతో వీడి రోగ నిరోధకశక్తి పూర్తిగా పోయింది. ఏమంటారు రామలింగరాజుగారు?" అన్నాడాయన రాజు వాళ్ళ నాన్నగారికేసి తిరిగి.

"అవునవును" తలూపుతూ అన్నారు రామలింగరాజుగారు.

నాకు మతిపోయినట్టయింది. పేంక్రియాస్ వీకవడానికీ, వీడి జ్వరానికీ ఏమిటి సంబంధం? అయినా వీడి పేంక్రియాస్ వీకవడమేమిటి? అది ఈ సుబ్బారావుగారికెలా తెలిసింది? సడన్‌గా నా మెడిసిన్ పరిజ్ఞానం ఎందుకూ పనికిరాకుండా పోతోందనిపించింది.

క్యూరియాసిటీ చంపుకోలేక అడుగకూడదనుకుంటూనే అడిగాను మెల్లగా-

"పేంక్రియాస్ వీకని మీకెలా తెలిసింది?"

"ఆ-దాందేముందండీ.... వెరీసింపుల్ కావాలంటే మీరూ చూడండి. రాజు పొట్ట చూసారా? కుడివైపు మాత్రమే ఎలా పైకీ క్రిందికీ కదులుతోందో" అన్నారు సుబ్బారావుగారు రాజా షర్టుని పైకి తీసి పరీక్షగా పొట్టవైపు చూస్తూ.

నాకుమాత్రం ఏమీ అబ్‌నార్మాలిటీ ఉన్నట్టుగా అనిపించలేదు. ఎడమవైపు కాస్తంత నీడ పడటంమూలాన కావచ్చు ఊపిరి తీసుకున్నప్పుడల్లా కుడివైపు మాత్రమే పొట్ట పైకీ క్రిందికీ కదులుతున్నట్టనిపిస్తోంది.

"రోజూ సమయానికి భోంచేస్తే ఈ పేంక్రియాస్ జబ్బులు రావు ఏమంటారు రామలింగరాజుగారు?" అడిగారు సుబ్బారావుగారు.

"కరెక్టు, వెధవ, ఏ ఒక్కరోజూ టైమ్‌కి భోంచేయడు" అన్నారాయన.

ఈలోగా రూమ్ లోపలికి సుడిగాలిగా దూసుకువచ్చాడో మనిషి కాస్తంత పెరిగిన గెడ్డం, చింపిరి జుత్తు, ఖద్దరులాల్చీ, పైజామాలో సినిమాల్లో కనిపించే విప్లవవాదిలా ఉన్నాడతను.

"వీరే హడావుడి రాజుగారని మా నాన్నగారి క్లోజ్‌ఫ్రెండ్ ఇతను నా ఫ్రెండ్. ఇక్కడే గవర్నమెంట్ హాస్పిటల్‌లో డాక్టర్" పరిచయం చేశాడు రాజు.

ఆయన నావంక ఒకసారి పరీక్షగా చూసి రామలింగరాజుగారివంక తిరిగాడు.

"మన రాజుకి ఒక గ్లూకోజ్ బాటిల్ ఎక్కిస్తే బాగుంటుందని తెచ్చాను ఇవ్వమంటారా?"

"అదంత అవసరమంటారా? నాకేమీ డీహైడ్రేషన్ లేదుకదా" అన్నాడు రాజు భయంగా గ్లూకోజ్ బాటిల్‌వంకా, ఇంట్రావీనస్ సెంట్ వంకా చూస్తూ.

నేనూ వారించబోయాను. కానీ మధ్యలోనే రామలింగరాజుగారు అడ్డుకొని-

"ఇచ్చేయండి కుర్రవెధవ వాడికేం తెలుస్తుంది? వాడలానే అంటాడు మీరిచ్చేయండి!" అన్నారు.

ఆయన ఆమాట రాజునే ఉద్దేశించి అన్నాడో లేక నన్నే అన్నాడో అర్థం కాలేదు నాకు.

పాపం రాజు నావంక నిస్సహాయంగా చూసాడు. నేనూ 'ఏం చేస్తాం' అన్నట్లు చూశాను వాడివంక.

హడావుడి రాజుగారు గ్లూకోజ్ బాటిల్‌ని మంచం రాడ్‌కి తగిలించి ఐ. వి. సెట్‌ని కనెక్ట్‌చేసి ఫ్లూయిడ్ స్టార్టుచేశారు.

"నేను వస్తానండి. ఇంకా బోల్డుమంది పేషెంట్ల ఇళ్ళకు వెళ్ళాలి. బాటిల్‌పూర్తికాగానే డిస్‌కనెక్ట్ చేయండి, లేదా నాకు కబురంపండి. వస్తా" అంటూ వచ్చినంత హడావుడిగా వెళ్ళిపోయాడు.

"పేరుకి తగ్గ మనిషి" అనుకున్నాను నేను.

నా కళ్ళముందే రాజుకి అనవసరంగా ఇంట్రావీనస్ ఫ్లూయిడ్స్ ఎక్కిస్తుంటే చూస్తూ ఊరుకోవాల్సి వచ్చినందుకు నాకు చాలా బాధ అనిపించింది.

కొద్ది నిముషాలకే రాజు మెల్లగా వణకడం ప్రారంభించాడు.

కాళ్ళదగ్గరున్న బ్లాంకెట్ తీసి కప్పాను నేను. కాని అలా ప్రారంభమైన చలి మరో ఐదు నిముషాలు గడిచేసరికి విపరీతంగా మారి గడగడా వణకడం మొదలెట్టాడు రాజు.

ఇంట్రావీనస్ ఫ్లూయిడ్స్‌వల్ల అప్పుడప్పుడూ ఇలా చలిరావడం జరుగుతుంది కాబట్టి నేను ఫ్లూయిడ్స్ స్టాప్‌చేసి నీడిల్ చేతిలోంచి లాగెయ్యబోయాను.

"ఆగండాగండి." దాదాపు అరిచినట్లుగా అన్నారు సుబ్బారావుగారు.

ఉలిక్కిపడి ఆగిపోయాను.

"చలిరావటం ఐ. వి. ఫ్లూయిడ్స్‌వల్ల కాదు"

"మరి?" అన్నాను నేను అయోమయంగా.

"ఆ మంచం క్రింద చూడండి మీకే తెలుస్తుంది" అన్నారు సుబ్బారావుగారు దిద్విలాసంగా.

నేను మంచం క్రిందికి తొంగిచూశాను అక్కడ రాజు వాళ్ళ పెంపుడు కుక్కతప్ప ఇంకేమీ కనిపించలేదు నాకు.

"అర్థంకాలేదా?" అన్నట్లు నావంక చూసారు సుబ్బారావుగారు.

"ప్రైవేట్ హాస్పిటల్స్‌లోనూ, నర్సింగ్‌హోంలోనూ గ్లూకోజ్‌వల్ల చలి ఎందుకురాదో తెలుసా? అక్కడ కుక్కలూ గట్రా ఏవీ ఉండవు గనక" అన్నాడాయన తనేదో గొప్ప విషయాన్ని కనుకున్నట్టు.

మంచం క్రింది కుక్కకి. ఇంట్రా వీనస్ ఫ్లూయిడ్స్ వల్ల వచ్చే చలికీ ఏం సంబంధముందో ఎంత ఆలోచించినా అంతుపట్టలేదు నాకు.

"జంతువుల పైనుండి వచ్చే గాలి ద్వారా కలిగే ఎలర్జీతో అలా చలిరావడం జరుగుతుందన్నమాట. అందుకే నర్సింగ్ హోమ్స్‌లోకి కుక్కలూ తదితర జంతు జాలం రాకుండా నీట్‌గా ఉంచుతారు. అదే జనరల్ హాస్పిటల్స్‌లో తరచూ ఇలా గ్లూకోజ్ మూలాన చలిరావడం పరిశుభ్రత లేకపోవడం మూలానే. మీరా కుక్కని తరిమేసి సుబ్బరంగా డెట్టాల్ పెట్టి కడిగేయండి. చలి ఆగిపోతుంది" అన్నారు సుబ్బారావుగారు.

వెంటనే రాజు వాళ్ళ నాన్నగారు భార్యని కేకేసి కుక్కని తరిమేసి డెట్టాల్‌తో క్లీన్ చేయించారు. అసలే వచ్చే పోయే వారికి కాఫీలు, టిఫిన్లు అందించ లేక సతమతమౌతున్న ఆవిడ ముక్కుతూ మూలుగుతూ వచ్చి క్లీన్ చేసి వెళ్ళింది.

ఈ తతంగమంతా అయ్యేసరికి రాజు మరింత వణకడం మొదలెట్టాడు. ఇహ నేను వూరుకోలేక రామలింగరాజుగారు, సుబ్బారావుగారు వారిస్తున్నా వినకుండా నీడిల్ వాడి నేతిలోంచి లాగేసాను. నా బ్యాగ్ తెరిచి డిస్‌పోసబుల్ సిరింజితో ఒక ఆంప్యూల్ ఇంజెక్ట్ చేసిన అర గంటకు గానీ వాడి చలి ఆగలేదు.

ఈలోగా వాడి ఫ్రెండ్స్ కాబోలు, ఇద్దరు రాజుని పరామర్శించటానికి వచ్చారు. వాళ్ళలో ఒకతనికి హోమియో పతి కొద్దిగా తెలుసట.

"నిన్న రాత్రి మీరు క్షేమంగా ఇంటికెళ్ళారా?" అడిగాడు కండక్టర్ ఓ పాసింజర్ని.

"వెళ్ళాను. నీ కెందుకొచ్చిందా అనుమానం?"

"రాత్రి మీరెక్కిన ఖాళీ బస్‌లో ఇంకొక స్త్రీ ఎక్కితే మీరు లేచి సీట్ ఇచ్చి నుంచుంటే అనుమాన మొచ్చింది."

—గొల్లపూడి శైలజ, హైద్రాబాద్.

"ఈ క్రానిక్ జ్వరాలకి హోమియోని మించిందిలేదు. ఆర్సెనిక్ 200 గనక రోజుకొక డోస్ వేసుకుంటే టప్పున జ్వరం దిగిపోతుంది" అన్నాడతను రాజుతో.

"నా ప్రాణమే పోయేటట్టుంది ఇంకా సేపయితే" అన్నాడు రాజు నీరసంగా.

"నువ్వేమీ కంగారు పడకు. నేవెళ్ళి పేంక్రియాస్ టాబ్లెట్లు పంపిస్తా" అన్నారు సుబ్బారావుగారు గుమ్మంవైపు కదులుతూ.

"పోనీ మళ్ళీ హడావుడిరాజుకి కబురంపించమంటావా?" అడిగారు రామలింగరాజుగారు.

నేను నా బ్యాగ్‌లోనుండి స్టెత్ తీసి రాజుని ధరోగా ఎగ్జామ్‌చేసాను. ఒక టెంపరేచర్ తప్పితే మరేమీ అబ్‌నార్మాలిటీ కన్పించలేదు.

"ఒరేయ్ రాజూ, నేనొక సలహా ఇస్తాను పాటిస్తావా?"

"మరికొన్నిమందులు వేసుకోమనడం తప్పించి మరేదైనా చెప్పు పాటిస్తా" అన్నాడు రాజు.



"అట్టే నేనూ అదే చెప్పబోతున్నా. నువ్వీక్షణంనుండీ ఏ మందూ వేసుకోకు" అన్నాను నేను.

"మరి జ్వరమెట్లా తగ్గేట్టు?"

"నా మాటమీద నమ్మకముంటే ఈ క్షణంనుండీ మందులన్నీ మానేయ్" రిపీట్ చేసాను. "నీ జ్వరం దానంతట అదేపోతుంది. మళ్ళీ నాకు ఎల్లుండి ఫోన్‌చేసి చెప్పు" అన్నాను నేను వెళ్ళడానికి ఉద్యుక్తున్నవుతూ.

"సరే" ఒప్పుకున్నాడు రాజు.

* * *

రెండురోజుల తరువాత రాజు ఫోన్ చేసాడు జ్వరం తగ్గిందంటూ.

"నాకు ముందే తెలుసు తగ్గుతుందని" చిన్నగా నవ్వుతూ అన్నాను.

"మందులు పూర్తిగా మానేసింతర్వాత జ్వరం తగ్గటమేమిటి? నా కేమీ అర్ధంకావటంలేదు, ఇంతకూ నాకొచ్చిన జ్వరం దేనివల్ల" అడిగాడు రాజు.

"డ్రగ్ ఫీవర్" అన్నాను.

తరచూగా వచ్చే వైరల్ ఫీవర్‌లాంటి జ్వరాలను మామూలు మందులతో తగ్గించటానికి బదులు రకరకాల ఏంటిబయాటిక్స్ వాడటంమూలాన కలిగే ఒక రకమైన వ్యాధి డ్రగ్ ఫీవర్. మందులన్నీ మానేస్తే కాని జ్వరం తగ్గదు ఈ వ్యాధి వచ్చిన వారికి.

అదే చెప్పాను వాడితో.

హడావుడిరాజు, సుబ్బారావు, ఇంకా అతని ఫ్రెండ్స్ తలొకరకంగా సజెస్ట్ చేసి ఇచ్చిన మందుల మూలాన వచ్చిన డ్రగ్‌ఫీవర్ మందులన్నీ మానేస్తేగానీ తగ్గలేదన్నమాట. ఈమాటే అంటే అన్నాడు రాజు.

"మరి వీళ్ళంతా పూర్తి నాలెడ్జిలేకుండా ట్రీట్‌మెంట్ ఎందుకు చేస్తారంటావ్?"

"నీకొక సంగతి తెలుసా? ప్రపంచంలో అన్ని వృత్తులలోనూ ఎక్కువ మంది ప్రాక్టీస్‌చేసే వృత్తి వైద్యం. ప్రతి ఒక్కరూ ఏదో ఒక సమయంలో స్వంతానికో లేక మరొకరికో ఏదో ఒక రకమైన వైద్యాన్ని సజెస్ట్ చేస్తూనే ఉంటారు. దీనివల్ల అప్పుడప్పుడూ ఇలాంటి ఫలితాలు తప్పవు" అన్నాను నేను.

"చెప్పడం మరిచాను. నీరసంగా ఉంటోంది కదాఅని నిన్నటినుండీ అవేవో వెల్లుల్లిపాయల మాత్రలట ఒంటికి మంచిదని అమ్మ చెబితే వేసుకుంటున్నాను. ఫర్లేదంటావా?" అడిగాడు రాజు.

తల పట్టుకొని కుర్చీలో కూలబడి పోయాను నేను.

